పక్కాగా సంక్షేమ పథకాల అమలు

● ఏపీ శాప్‌నెట్ ఛైర్మన్ కృష్ణచైతన్య

జే.పంగులూరు: రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందని ఏపీ శాప్‌నెట్ ఛైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బాచిన కృష్ణచైతన్య అన్నారు. మండల పరిధిలోని రామకూరు గ్రామంలో 3వ రోజు శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కృష్ణచైతన్య ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయని ఆరా తీశారు. జగనన్న పాలన సంతృప్తికరంగా ఉందంటూ లబ్ధిదారులు కృష్ణచైతన్యకు తెలిపారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే ఆలోచనతో జగనన్నకు చెబుతాం కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్, మండల ఉపాధ్యక్షుడు యర్రం శ్రీనివాసరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాయిణి వెంకట సుబ్బారావు, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు ఏ ఆంజనేయులు, ఎంపీటీసీ రామాంజమ్మ, అడ్డగడ ఆంజనేయులు, ఏ వెంకయ్య, ముకుంద హనుమంతురావు, గిరిబాబు, షేక్ జాన్‌బాషా, షేక్ బాబు, రహిమాన్, కుంచాల రాఘవులు, మిరియాల నాగరాజు, చిన్నబుల్లెయ్య, అజీల్, అన్ని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు హాజరయ్యారు.



లబ్ధిదారుడికి బుక్‌లెట్ అందిస్తున్న శాప్‌నెట్ ఛైర్మన్ కృష్ణచైతన్య

అధికారులు అలసత్వం వీడాలి

● వాడివేడీగా మండల సమావేశం

కారంచేడు: గత ప్రభుత్వంలో పంచాయతీల నిధుల దుర్వినియోగంపై ఎన్నిసార్లు విచారణ చేపట్టినా ఇంత వరకు బాధ్యులపై ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని సభ్యులు ప్రశ్నించారు. శనివారం మండల కేంద్రం కారంచేడు మండల పరిషత్ సమావేశ హాలులో మండల సమావేశం నిర్వహించారు. సభ్యుల ప్రశ్నలకు ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు స్పందిస్తూ నిధుల దుర్వినియోగంపై ఉన్నతాధికారులు వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవడానికి మండల పరిషత్ తీర్మానం చేసి కలెక్టర్‌కు పంపించాలని ఎంపీడీఓ విజయలక్ష్మికి సూచించారు. మండల అభివృద్ధే లక్ష్యంగా మా రెండున్నరేళ్ల పాలనలో 15వ ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధులు, జెడ్పీటీసీ నిధులు, ఎన్ఆర్ఈజీఎస్ నిధులను వెచ్చించి సుమారు రూ.10 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. తరువాత జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు యార్లగడ్డ అక్కయ్య చౌదరిలు పంచాయితీ నిధుల దుర్వినియోగంపై చర్చించారు. కొమ్మమూరు ఆయకట్టు ద్వారా వరి సాగు చేసే అన్నదాతలకు వారాబందీ ద్వారా సాగునీటిని విడుదల చేస్తున్నారని ఇరిగేషన్ జేఈ అరుణకుమారి సభకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, ఎంపీడీవో డీ విజయలక్ష్మి, కార్యనిర్వాహణాధికారి లక్ష్మీనారాయణ, డీటీ సుశీల, ఐసీడీఎస్ సీడీపీఓ టీ ఝాన్సీ, మండల కో ఆప్షన్ మెంబర్ ముల్లా నూర్‌అహ్మద్, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ వాసుబాబు

వేరుశనగ పంట పరిశీలన

చీరాల టౌన్: మండలంలోని కావూరివారిపాలెంలో రైతులు సాగు చేస్తున్న వేరుశనగ పంటను శనివారం బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు పరిశీలించారు. వేరుశనగ పంటలను ఆశించే ఆకుమచ్చ తెగుళ్లను గుర్తించి నివారణ చర్యలను రైతులకు వివరించారు. వేరుశనగ పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటుగా ఆకుపచ్చ తెగుళ్ల పసుపు తెగుళ్లగా మారడం వలన పంట పూర్తిగా దెబ్బతినకుండా సూక్ష్మపోషకాలు వాడే విధానంపై రైతులకు ప్రొఫెసర్లు మాధవ్, ఉషారాణి, కిరణ్‌లు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రమణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.



వేరుశనగ పంటలను పరిశీలిస్తున్న ప్రొఫెసర్లు

ఘనంగా వాల్మీకి జయంతి

అద్దంకి: రామాయణాన్ని రచించిన వాల్మీకి జయంతిని సంతమాగులూరు గ్రంథాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లైబ్రేరియన్ భాస్కరరెడ్డి మాట్లాడుతూ వాల్మీకి దొంగ నుంచి పరివర్తన చెంది, మహాజ్ఞానిగా మారాడని, ఆదర్శ పురుషుడు సీతారాముల చరిత్రను ముందే కావ్యంగా రాసిన గొప్ప వ్యక్తని కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సౌకర్యాల మెరుగుకు సత్వర చర్యలు

పర్చూరు (చినగంజాం): సంక్షేమ వసతి గృహంలో సౌకర్యాల మెరుగుకు సత్వర చర్యలు తీసుకోవాలని పర్చూరు జూనియర్ సివిల్ జడ్జి పీ శాంతి ఆదేశించారు. చెరుకూరు గ్రామంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని పర్చూరు మండల న్యాయ సేవాధికార సంస్థ వారి ఆధ్వర్యంలో పర్చూరు జూనియర్ సివిల్ జడి శాంతి శనివారం సందర్శించారు. మెయిన్ గేటు లేకపోవడాన్ని ఆమె ప్రశ్నించారు. గదులకు తలుపులు లేకపోవడాన్ని గమనించి పిల్లలకు వారి వస్తువులను రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పంచాయతీ వారి ద్వారా హాస్టల్‌లోని చెత్తను, పచ్చగడ్డిని తొలగించాలని ఆదేశించారు.

పీహెచ్‌సీ స్థలం కేటాయింపులో జాప్యం ఏమిటి ?

● అధికారులు మొద్దునిద్ర వీడాలి

బల్లికురవ: ప్రభుత్వం ఆరు నెలలక్రితం పీహెచ్‌సీ మంజూరు చేసి వైద్యులు సిబ్బందిని కేటాయించిందని.. భవనాల నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయింపులో ఎందుకు జాప్యం చేస్తున్నారని జిల్లా రైతు అధ్యక్షుడు చింతల పేరయ్య డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్‌ను ప్రశ్నించారు. శనివారం ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ అధ్యక్షత మండల సర్వసభ్య సమావేశం జరిగింది. బల్లికురవ, వల్లాపల్లి, కూకట్లపల్లి, చెన్నుపల్లి గ్రామాలకు చెత్తనుంచి సంపద కేంద్రాలు మంజూరైనా రెండేళ్లుగా స్థలం కేటాయించటం లేదని ప్రభుత్వ ఆశయాలను నీరుగార్చుతున్నారని పేరయ్య అసహనం వ్యక్తం చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ 3 నెలల కొకసారి జరిగే మండల సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గైర్హాజరు అవుతుంటే ఆ గ్రామాల్లోని సమస్యలు ఎలా పరిష్కరించుకోగలుగుతారని చురకలంటించారు. మండల సమావేశాలు సమస్యల పరిష్కారానికి వేదికలని, రాబోయే సమావేశానికైనా సభ్యులు, సర్పంచ్‌లు హజరు కావాలని కోరారు. ఎంపీడీవో సీహెచ్ కృష్ణ, వ్యవసాయాధికారి ఎస్‌వీపి కుమారి, ఏఈ దుర్గా రమేష్, పంచాయతీ రాజ్, ఎస్ఎస్ఏ ఏఈలు జీ. హనుమంతరావు, రాజన్‌బాబు, ఏపీఎం సురేంద్రబాబు, పశువైద్యాధికారి మహేశ్వరరావు, వైద్యాధికారిణి మమత, ఎంఈవో కె. రమేష్‌బాబు, జెడ్పీటీసీ చింతల అంజలి, మండల ఉపాధ్యక్షులు ఐవీ సుబ్బారెడ్డి, కె ఆదెమ్మ మాట్లాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

అందుబాటులో రైతులకు ఎరువులు

జే.పంగులూరు: అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి అబ్దుల్ సత్తార్ తెలిపారు. మండల పరిధిలోని పంగులూరు వ్యవసాయ కార్యాలయంలో శనివారం రైతు భరోసా సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ పీఎం కిసాన్‌కు సంబంధించి 160 మంది రైతులు ఎన్‌పీసీఐ లింకు కాని వారు త్వరగా లింక్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏవో సుబ్బరెడ్డి, వీఏఏ పాల్గొన్నారు.

ఉజిలీపేటలో కార్డన్ సెర్చ్

చీరాల: పట్టణంలో ఉజిలీపేటలో శనివారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు చీరాల పోలీసులు, సెబ్ అధికారులు సంయుక్తంగా కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఉజిలీపేటలోని అన్ని ఇళ్లను సోదా చేశారు. కార్యక్రమంలో సరైన పత్రాలు లేని 19 అనుమానిత వాహనాలను పోలీసులు గుర్తించి సీజ్ చేశారు. వీటిలో 18 ద్విచక్రవాహనాలు, ఒక ఆటో ఉన్నాయి. సీఐ సోమశేఖర్, సెబ్ సీఐ సోమయ్య, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

138 మద్యం బాటిళ్లు స్వాధీనం

అద్దంకి రూరల్: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి నుంచి మద్యం బాటిళ్లు శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై ఎం వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. శనివారం రాత్రి అద్దంకిలోని కలవకూరు క్రాస్ రోడ్డు వద్ద సిబ్బందితో వెళ్లగా పోలీసులను చూసి బైక్, 138 మద్యం బాటిళ్లను వదిలి పరారయ్యాడు. పరారీలో ఉన్న నిందితుడిని వెతుకుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎరువుల దుకాణాలపై కేసు

మార్టూరు: మండలంలోని బొబ్బేపల్లి గ్రామంలో నిర్దేశించిన ధరల కంటే ఎక్కువ రేట్లకు రైతులకు ఎరువులు విక్రయిస్తున్న రెండు దుకాణాలపై శనివారం సాయంత్రం బాపట్ల జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు కేసు నమోదు చేశారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని రైతుల ఫిర్యాదుపై తనిఖీ నిర్వహించి నిర్ధారించుకొని కేసు నమోదు చేసినట్లు నాగేశ్వరరావు తెలిపారు.